# కర్రపెత్తనం

''ఆడ దానికి పెత్తనం యిస్తే పేనుకు పెత్తనం యిచ్చినట్టేనంట! - పెత్తనం .స్తే పేను అదే పనిగా మునం బట్టి గొరిగితింది. అదే ఆడదానికిస్తే అంతకింతకూ సతాయించి చంపితింది. ఆక అన్నా తప్పే. ఊక అన్నా తప్పే. అందుకనే ఆడ పెత్తనం అదేందో దొరతనం రొండూ వొగిటే నంటారు.

దొరలు పాయ్‌నారు. దొరతనాలు పాయ్‌నాయి. వాళ్లతో గూడానే వాళ్ల పెత్తనాలు మూటా ముల్లె సర్దుకునేసినాయి. అయితే ఆడపెత్తనాలు మాత్రం కరుకుమాయలా. ఏమాత్రం సళ్లా వొదల్లా. సళ్లొదిలే దేంది? చుక్కల పర్వతాన గాలిగోపరం మిందికెక్కి కులకతా ఉండాయ్. సూర్రె చెంద్రులుణ్ణంత కాలం చలామణి అవతానే ఉంటాయి చిరంజీవిగా!

మాయమ్మ వగాతగా రొండూలేని మణిసి. రైక గుడ్డేసుకుండే దానిగ్గూడా శాతగాదు. పదిమందిని కనింది. ఆ పైట సెరుగు మొరుగులోనే పాలిచ్చి సాకేసింది. ఎప్పుడైనా నేను చదివిన పద్దెమో పాటో రేడియోలో ప్రెసారం అవతా ఉంటే-

''యమా! యమా! యిట్రొచ్చి కూసోయేమే'' అంటే వచ్చి కూసుండేది. రేడియో పెట్టి యినిపిస్తే-

''ఒరే! నువ్వేగదాంట్రా అబ్బోడా! మాట్లాడ్తా ఉండేది. అవును. నీగొంతేనే. దీని లోపలికె ట్లొంచిదిరా? ఉడుబోతుకాయిగదా? నువ్వేం తక్కవయిన నాకొడికివా? దూరేసుంటావులే. ఎట్టయినా సందుజేసుకోని లోపల దూరుకోనుంటావ్.'' అని పకపక నవ్వతా రేడియో చుట్టూ తలకాయి తిప్పి తిప్పి చూసి చుట్టుపక్కల ఏమీ లేదని నిర్ధారించుకోని-

''అవరా! కాలమా? ఆడేణ్ణో మాట్లాడ్తా ఉండేది దీన్లోకెట్లొచ్చిందో? ఈడ యినిపిస్తా ఉండాది. మణిసి చస్తే బతికించే దొగిటే తక్కవ'' అని మొకాన్ని శాటంత చేసుకోని చూసేది.

తూరుపు అంటే పాతగుంట. పరమట అంటే పెనుమూరు. ఇంకా నిక్కీ నీలిగితే యిద్దో ఈ తిరపతి. అది గూడా రొండెద్దల బండ్లమింద తిరపతికి చింతపొండు తోలుకొనొచ్చేది.గాబట్టి. ఎండలుగాసే ఈ బూమండల మంటే ఈ మూడూళ్లే! – అనుకునే ఎర్రితల్లి. ఎట్ట కొటేసిందో కొటేసింది. రొండో కంటికి తెలవకుండా కొటేసింది. మా అయ్యచేతి పెత్తనాన్ని అలాగ్గా కొటేసింది. ఇంక చూసుకో నా సామిరంగా! మా అయ్యకత. కూసో అంటే కూసో. లెయ్ అంటే లెయ్! –

ఇప్పుడంటే కరంటు వచ్చేసింది. మెడమెడకు ఒక గుదిబండ తగిలించు కున్నెట్టు బాయిబాయికి ఒక మోటారు తగిలించు కున్నారు. అదే ఒకప్పుడైతేనా? నాలుగు గుంటల కయ్యుంటేగూడా చాలు. ఆ యింట్లో ఏది వుండి ఏది లేకుండాబోయ్‌నా బానా మోకు బండీ కదురుగోలు ఉండి తీరాల్సిందే. బక్కవో బడుగువో కాడెద్దులు గాటకట్టాల్సిందే!

సరే! ఎద్దుచర్మంతో బానా తొండం కుట్టిచ్చేదానికి మాదిగ రాముడు ఉండనే ఉండె. బండీ కదురుగోలంటే అదికేశివాశారి పని. ఇంక మోకు? మోకు కాడికొస్తే ఆ పాయికట్లో మా అయ్య పేరు చెప్పే యింకొకరి పేరు చెప్పాల!

ఊరిముందర గుంటకట్ట. ఆ కట్టమింద కొలిమి చింతమాను. ఆ చింతమాని కింద నులక మంచం. ఆ మంచం మింద సుంగిడ్సి తలగుడ్డ చుట్టుకొని మా అయ్య కాలిమింద కాలేసికూసోని ఈ పక్క వొకడు ఆ పక్క ఒకడు నిలబడుకొని నార అందిస్తావుంటే మా అయ్య చూపంతా యిడస్తావుండే పురిమిందనే ఉండేది. ఆ బాటమింద వచ్చేపొయ్యేవాళ్ల చూపులన్నీ మా అయ్యమిందనే ఉండేవి.

పొద్దు గూట్లో పడ్తా పడ్తా ఉంటింది. అది ఆరుమట్ల బాయికైనా సరే! మోకు ముద్దు బెట్టుకుందామన్నెంత బటువుగా ముడువయి పోతింది. అప్పుడు చూడాల మా అయ్య మొకాన్ని. ఎదురుంగా గుంటలో పూసే దామర పూలన్నీ మా అయ్య మొకంలోనే పూస్తా ఉంటాయి.

మొనగోడు మా అయ్య! ఒకడు వొప్పారం చెప్పే దానికి వల్లగాకుండా మోకేస్తాడే అనుకో. ఎయ్యాలంటే పెత్తనం మాయమ్మదే గదా?

ఆ పాయికట్లో అందురు సేద్దిం నాద్దిం చేసుకోని బతికేవాళ్లే. ఎవుడికో వొకడికి మోకుతో అవసరం పడ్తానే ఉంటింది. అటుమంటప్పుడు వాళ్లు మా అయ్య కాడికొచ్చి–

''గోయిందరెడ్డీ! గోయిందరెడ్డీ! మోకు తుట్రాగా పనికిరాదు. మూరకొక తేప. మాట మాటకు తప్పుమోకు పడిపోతా ఉండాది. సవరం! సవరమట్టా కలబందనార బటువు చేసి పెట్టుకుణ్ణా. ఒక్క పూట సామీ! నీది గాదనుకుణ్ణావంటే...'' అని అడిగినారనుకోండి. ఎంటనే మా అయ్య–

''నా దేముండాదబ్బా? ఉండాది గదా మా బాశాలి. దాన్నొక మాట డగండి!'' అంటాడు. అప్పుడు చూడాల మాయమ్మను! సివ్వ మాదిర్తో లేస్తింది పైకి.

''వాడెవుడో వొకడు. సుద్దంగా నీ మాదిర తలమాసినోడు. 'వగలేని మొగోడా పొగులెందుకొస్తివి?'' అని అడిగితే 'అందుగ్గాదు నేనొచ్చింది. అగ్గికి!' అన్నాడంట. అట్లుండాదే యాపాడం. ఎంతదా వాళ్ల సంకటి నూకలు బోసే కెలకతారనుకో. గుడ్లకొచ్చిన కోడిపెట్ట నొకదాన్ని కోసి పెట్తారనుకో. అంత మాత్రాన బతుకంతా పారుగింటి పులగూర కతేనా? ఆకు తోట్లో తీగెదించాల. మిట్టబాయి కింద కయ్యల్లో తిరుగుసాలు తోలాల. రాగి పైరు నాట్నానికి పాదులు గట్టాల!'' అంటా దండకం ఎత్తుకుంటింది.

''బొదులు మణిసిని పెట్తా ఉండాం గదా పాపక్కా!'' అంటారు వచ్చినోళ్లు.

ఆ మాట చెవల్లో పడ్తే మణిసిని చూస్తానే ముంగాళ్ల పైకెత్తి దూరే మా ఎర్రెద్దే మేలుగదా మాయమ్మ కంటే?- వాళ్లను మింగేసే దాని మాదిర్తో చూస్తా-

''పెట్నార్లే! పెట్టేది లేదని నేనేమన్నా ఈ నోట్తో కూసినానా? లేదే? పెట్తే మాత్రం కూలేడుపు కూలేడుపే గదా? ఇంతకూ వొకరినని ఏమి లాబం? మన బంగారం సుద్దంగా ఉంటే- యింత కంతకు యిట్లా యీదిలోబడే పనేముంటింది. ఓపినంత పనుండాదని ఒక్క మాట్తో వగదెంచుకోనుంటే కత యింతదూరం ఎందుకొస్తింది? పోనీ! ఎవురేడ పోతే నాకేం? అంతా ఏయేట్లో కొట్టుకోని పోతే మాత్రం నాకేం? ఈ బూములు బావులు నేనేమన్నా ఎత్తి నెత్తిన బెట్టుకోని పోబోతానా? లేకుండాబోతే నేనొకదాన్నే ఈడేమన్నా శాశ్విత్తంగా చీల్లు గొట్టుకోని ఉండబోతానా?''

అక్కడుండే గోడతోనో గుంజతోనో మాట్లాడ్తా ఉణ్ణెట్టు అప్పిటికి అక్కడెవురూ మొగపురుగే లేనట్టు మాయమ్మ యాష్టపోతా ఉంటింది. ఎంతైనా మాఅయ్య గూడా మొగోడే గదా? ఎంతదా పెత్తనం చేతికిస్తే మాత్రం సరి మొగోళ్ల ముందర ఎంతసేపని నోరు మూసుకోని ఉంటాడు.

''ఒక్క మాట్తో చెప్తే పొయ్యేదానికి యింత రామాయిణం ఎందుకే?'' అని బీకరానికన్నా అనాల గదాని అంటాడు. ఇంక చూసుకో నా తండ్రీ!

''ఎట్టెట్టా? ఒక్క మాట్తో చెప్తే సరిపోతిందా? ఏమని చెప్పమంటావే? అయ్యా! మా మొగోడు మోకేసేదాంట్లో మొనగోడు. మీరు బొదులు మణిసిని పెట్నాసరే? పెట్టకుండా పొయ్‌నా సరే? ఎంట బెట్టుకోని పొండి. ఏం పెట్నా పెట్టకుణ్ణా పెట్టకోడిని మాత్రం కోసి పెట్టండి. మా మొగోడికి నోరు చవిసెడి పొయ్యుండాదంట. పాపం! వాసి పొయ్యుండాడు. అని చెప్పమంటావా?'' అంటా యాసణ్ణం పడేది.

అప్పుడు చూడాల మా అయ్య గెతి!

'ఎందుకురా దీని చేతికి పెత్తనం పట్టిచ్చినామే?' అని మెడకాయి పట్టుకుంటే గిల గిల కొట్టుకుండే కోడి పిల్ల మాదిర్తో మా అయ్య యిలయిల్లాడి పొయ్యేటోడు!

పాపం! కన్నోరు. కట్టెలో పాణం ఉండేదాకా మాయమ్మ చేతి పెత్తనాన్ని చేతికి తీసుకోవాలని కలవరిస్తానే కడతేరి పాయ. అదే మాయమ్మ! వారం దినాలుగా మంచాన

పడి గోరస్తా ఉండాది. అట్నో యిట్నో అనుకుంటానే ఉండాం. అయినా కోడాండ్ల మింద కొడుకుల మింద కూతుళ్ల మింద పెత్తనం చలాయిస్తానే ఉండాది.

ఆ సాలు ఎట్ల పోతింది. వదలకుండా వచ్చినట్లుండాది. పగ్గాలు మా బాశాలి చేతిలోనే! అప్పటికి నేనేం తక్కువైన నా కొడికినా? కాదే!

నేను మా యింట్లో కాసిన ఉడబోతుకాయిని. కింద దించితే మట్టి అవితింది. పైకెత్తుకుంటే గెద్ద తన్నకపోతిందని మావాళ్లు శానా శానా ముదిగారం చేసిరి. ఇంక యింట్లో మనం క అంటే క! కీ అంటే కీ!

ఇంక చదువులోనా? ఎవుడూ ఏలెత్తి చూపేదానికి లే. లెక్కల్లో అయితే నూటికి నూరు. పాపం! అప్పావు పిళ్ల అయ్యోరు. చచ్చి సొర్గలోకాన యాడుండాడో ఏమో? ఎంత ముదిగారంగా చూసుకుంటా ఉండె. ఎదురు బెత్తం చేతికిచ్చి ఏకంగా నన్ను ఆయిస్కూలికి పీటాదిపతిని చేసె.

ఇంకేముండాది? పెత్తనం చేతికొచ్చేసె. బెత్తం చేతిలో వుండె. ఇంక మనం వుండాం. మన రాజ్జిం ఉండాది. ఏలుకున్నాం చూడు నాసామిరంగా!

కొందురు శెనిక్కాయలు తేవాల. కొందురు వాటిని వొల్సి పెట్టాల. ఆ శెనిగ్గింజల్లో నంజుకుండే దానికి యింకొందురు బెల్లం తేవాల్సిందే! రొండు సెక్రాల బండి మింద కూసో బెట్టుకోని మా ఊరి ముందర బాటమింద ఎగవూర్నుండి కొందురు దిగవూరుదాకా దిగవూర్నుండి కొందురు ఎగవూర్దాకా ఈడవాల్సిందే? లేకుండా బోతేనా? అప్పావు పిళ్ల అయ్యోరిచ్చిన బెత్తం ఉండాది. ఆ బెత్తం మింద మన పెత్తనం చలాయించు కుంటానే పదో తరగతి దాకా చదువుకుంటే మాఅయ్య-

''ఒరే అబ్బోడా! వొంగినోడి కింద వొంగే దెందుకురా? మనకేం? ఉణ్ణికాడికి అంతో యింతో కయ్యాగాలవ ఉండాది గదా? ఏమి జేసినా ఎంత జేసినా మేడి పిడికి కిందనేరా!'' అని అంటే యినిపించుకోకుండా పాయ్ ఉద్దోగంలో చేర్నా. ఆడెవుడో ఒక పనికిమాల్న నాయాలు. నామింద పెత్తనం చలాయించబోతే-

''ఒరే కుండాకోర్ నాయాలా! ఈ పొప్పులుండాయే అవి మన దగ్గిరేమీ ఉడకవురా. ఉంటే గింటే నీ పెత్తనం కావాలంటే నీ పెండ్లాం మింద చలాయించుకో!'' అని రాజీనామా కుడిచేత్తో గాకేసి ఆ కాకితాన్ని ఎడమ చేత్తో యిసిరి వాడి మొకాన కొట్టేసి వచ్చిన మొనగోణ్ణి!

అయితే మాత్రం పెండ్లాం పెత్తనం చలాయిస్తావుంటే కుక్కిన పేను మాదిర్తో పడుండా!

అయినా యింటి వరసాపిని గదా? పొమ్మంటే యాడికి పోతింది? ఎట్ల పోతిందిలే!

ఒక దినం తెల్లారే కాడికి మా బాశాలికి నాకూ మాటామాట పడె. నేనా ముందురేత్రి ఏందో చెయ్‌రాని పనేందో చేసేసి వచ్చినట్లు తెల్లారే కాడికి లగుసుకుణ్ణింది. అంత కాఫీ గూడా నా మొకాన కొట్టకుండా బిగించుకుణ్ణింది.

''నువ్వంత కాపీ ఈకుండా బోతే మాత్రం బతికినంత బతుకు బతికి అంత కాపీ సంపాయించుకో లేకుండా పోతానా? ఊరేం గొడ్డుపోలేదులే?'' అనుకోని ఎలబార్నా.

''కన్నగ సాట్లుపడి రాసో కూసో సంపాయిస్తా ఉండేది మనం. సాకి సంతరిస్తా ఉండేది మనం. నడిమిద్దె యిదెక్కడి బోడి పెత్తనం?'' అని అప్పుడప్పు డనిపించినా మా అయ్య మాదిర్తో నేను గూడా ఆ పెత్తనాన్ని చేతికి తీసుకోలేకుండా పోతావుండానే అని ఆడపెత్తనాన్ని గురించి ఆలోచించుకుంటా పోతా పోతా వుండి ఆ నాలుగ్గాళ్ల మండపం కాడ అట్టానిలబడ్తి!

ఆడ నిలబడుకోనుండే ఒకొక్కడి చేతిలో వొకొక్క కట్టె ఉండాది.

ఆ కట్టె రమారమిగా రెట్లా ఉండాది. నాలుగు మూర్ల పొడుగుండాది. పోలీసోళ్ల శాతల్లో ఉంటాయే లాటీకట్టెలు!- అట్టాంటివాట్ని రొండు కట్టెలు చేరిస్తే యీ కట్టె వొగిటయ్యేటట్టుండాది.

ఇదేందిది? నాలుగ్గాళ్లమండపం కాడికి వచ్చే వాళ్లందురు కడుపులు శాత పట్టు కోనొస్తారు. కడుపులు శాత పట్టు కుణ్ణోళ్ల ఏం పట్టు కోవాల? కరిణో... మట్టపలకో... లేకుండాబోతే సున్నం పోసుకుండే డబ్బా... ఆ సున్నం పూసేదానికి మట్టో పట్టుకోవాల. ఈ పొద్దు తలా ఒకకట్టె శాత పట్టుకోనుండారే? అని నోరుతెర్సుకోని చూస్తావుంటే-

''ఏమబ్బయ్యా? నోట్లోకి ఈగిలు దూరేది గూడా తెలవకుండా చూస్తా ఉండావే? నీగ్గూడా కావాలంటే ఒక కట్టె ఫ్రీ!'' అనె కట్టె శాత బట్టుకోనుండే ఒకాయిన.

''ఏందీ కట్టె? ఏందీ పసుపు సొక్కాయి! ఫ్రీ ఏంది?'' అని ఆలోచించుకుంటా ఆడ నిలబడుకోనుంటే అగుస్మాత్తుగా ముత్తారెడ్డన్న ఆడికొచ్చె!

''ఒరే అబ్బోడా! మీ అయ్యమింద పెత్తనం మీయమ్మ చలాయించింది. నీ మింద పెత్తనం యిప్పుడు మీ బాశాలి చలాయిస్తా ఉండాది. అంటే యిది ప్రెజాసామ్మెం రూలుకు యిరుద్ధం గదా? మనం కష్టప్పుడీ... ప్రెమప్పుడీ... బాదప్పుడీ రాజుల దగ్గిర్నుండి పెత్తనం పెరుక్కుణ్ణాం. అయినా ఈ పెత్తనం యింకా కొంత మంది రవిడీల శాతల్లో యిరుక్కోని పొయ్యుండాది. అంటే ప్రెజాసామ్మెం దెబ్బతింటా ఉండాదన్న మాటేగదా? అది దెబ్బ తినడమంటే ఏంది? కర్ర పెత్తనం కొనసాగతా ఉణ్ణెట్టేగదా లెక్క? అందుకే దాన్ని అణిచి పారేయాలని ముక్కెంగా మన ముక్కెమంత్రి పూలేసుకుణ్ణాడు. అందుకే తలా ఒకకట్టె చేతి కెత్తుకో మన్నాడు. అంటే దీని అర్తం? మన అన్న మన ముక్కెమంత్రి తలా ఒక కట్టె చేతికిచ్చి ప్రెజాసామ్మెన్ని కాపాడ్తా ఉండాడన్న మాట. ఆ మాత్రం ఎరికలేక పోతే ఎట్రా ఎర్రోడా?'' అనె.

అదీ నిజిమే గదా? అప్పుడెప్పుడో ఎమ్జీఆర్ కత్తులే ఎత్తుకోమంటే మన అన్న ఎన్టీయార్ కర్రలెత్తుకోమన్నాడు. ఆ కాడికి మేలేగదా? అనుకుంటి. ●